
www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 22 మే 2023
5
తిరుపతి



శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

24న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి- క్యాంపస్
శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వం స్వామి ఆలయంలో మే 24న ఉదయం 6.30గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. మే 31 నుంచి జూన్ 8వతేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచీలీగడ్డ తదితర సుగంధద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. మధ్యాహ్నం 1.30గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్ తొలగించాలి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:
ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, వచ్చే పార్లమెంటు సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘ అధ్యకులు ఆర్.కష్ణయ్య డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఎస్వీయు సెనేట్ హాల్లో ఆదివారం ఏపీ బిసి ఉద్యోగుల ఆత్మీయసభ జరిగింది. ఈసభకు బీసీ సంఘం అధ్యక్షులు ఎస్.మరేష్, ఉద్యోగుల సంఘం అధ్యకులు పావులూరి మునిబాల కుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆర్.కష్ణయ్య ప్రసంగిస్తూ బీసీల ఉద్యమానికి బీసీ ఉద్యోగులు నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. ఉద్యోగులు ఐకమత్యంగా ఉద్యమిస్తే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దేశ జనాభాలో 56శాతం జనాభా గల బీసీలు కులాల పేరు మీద విడిపోవడం వలన న్యాయమైన డిమాండ్లు సాధించలేకపోతున్నారు. బిసిలలో బానిస ఆలోచన విధానం పోవాలన్నారు. బీసీలు తెగించి పోరాడకపోతే బానిస బతుకులు, భిక్షపు బతుకులు బతకాల్సి వస్తుందని హెచ్చరించారు. 75 సంవత్సరాల తరువాత రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించకపోతే ఇదేమి ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. బీసీ కోటా కింద ఉద్యోగాలు వచ్చాయి. ఈకులాల నుంచి వచ్చినందున ఈకులాల అభివద్ధి కోసం పోరాడే సాంఘిక బాధ్యత భుజాన వేసుకోవాలని పిలుపునిచ్చారు. బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి చట్టపరమైన, రాజ్యాంగపరమైన, న్యాయపరమైన అవరోధాలు, అడ్డంకులు ఏమీలేవు. రాజ్యాంగబద్ధమైన మండల్ కమీషన్ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. చట్టబద్ధమైన పార్లమెంటరి కమిటీ ఛైర్మన్ నాచియప్పన్ కమిటీ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సు చేసింది. ఇక ఇటీవల సుప్రీం కోర్టు ఉత్తరప్రదేశ్ రిజర్వేషన్ల కేసు సందర్భంగా జనాభా ప్రకారం బిసి ఉద్యోగుల సంఖ్య లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని తీర్పు చెప్పింది. అన్నివైపుల నుంచి బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టాలని సిఫార్సులున్నాయి. ప్రమోషన్లలో రిజర్వేషన్లు పెట్టడానికి ఎలాంటి అవరోధాలు లేవన్నారు. ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, ఇంటెలిజెన్స్ ఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్వో శ్రీనివాసరావు, గుజ్జకష్ణ, భూపేష్ సాగర్, వేముల రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.



బిసి సంఘం సమావేశాన్ని ప్రారంభిస్తున్న ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు

వైసీపీ నాయకుల దౌర్జన్యం..!

- గ్రీన్ అంబాసిడర్ స్థలాలపై కన్ను - జేసీబీతో దురాక్రమణకు యత్నం
- పోలీసుల రంగప్రవేశంతో నిలిపివేత - పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



ప్రజాశక్తి -సత్యవేడు
సత్యవేడు మండలంలోని మదనం బేడు గ్రామానికి చెందిన గ్రీన్ అంబాసిడర్, పంచాయతీ కార్మికుడు మునస్వామికి చెందిన ఇంటి స్థలంపై గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకుల కన్ను పడింది. గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు వేలాయుధం, రాబర్ట్, గోపి, జయరామన్, కామరాజ్ కలిసి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఏకంగా జేసీబీని వెంట తీసుకెళ్లి గ్రీన్ అంబాసిడర్ మునస్వామికి చెందిన ఇంటిని పగులగొట్టడానికి దౌర్జన్యంగా.. చట్ట వ్యతిరేకంగా రౌడీయిజం చేస్తూ ఆ స్థలాన్ని ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని వెళ్లారు. 25 ఏళ్లగా కాపురం ఉంటున్న ఇలు న్ను ఆక్రమించడానికి.. కూల్చడానికి ప్రయత్నం చేశారు. ఈక్రమంలో మునస్వామి పోలీసులకు సమాచారం అందించడంతో స్పందించిన పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాల వారిని శాంతింపజేశారు. జేసీబీ తీసుకొచ్చి ఓ వ్యక్తి ఆస్తిని ధ్వంసం చేయడం.. దురాక్రమణ చేయడం చట్టరీత్యా నేరమని.. వివాదాలుంటే రెవెన్యూ అధికారులతో సమస్యలను పరిష్కరించుకోవాలని.. వ్యక్తిగతంగా కక్ష కట్టి ఓ వ్యక్తి ఆస్తిపై దౌర్జన్యం చేయడం చట్ట విరుద్ధమని.. కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇరవై సంవత్సరాల క్రితం మునస్వామి తన కుటుంబంతో సహా హరిజనవాడ వదిలి రోడ్డు పక్కన 80 సెంట్లు ప్రభుత్వ భూమిని చదువు చేసుకుని అందులో ఇల్లు కట్టుకున్నాడు. అదే స్థలంలో కొంత నర్సరీ ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నాడు. అయితే వైసీపీ నాయకులు రాజకీయ కక్ష కట్టి రెవెన్యూ అధికారులను లొంగ తీసుకొని ఆ నేలను ఎలాగైనా మునస్వామికి దక్కకుండా చేయాలన్న ఉద్దేశంతో వారి కుటుంబం రోడ్డు పాలు కావాలని అధికార యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని రెవెన్యూ అధికారులతో నోటీసులు ఇప్పించారు.

ఇంటి నుండి బయటకు గెంటాలని ప్రయత్నించినప్పుడు రెవెన్యూ అధికారులు ఇచ్చిన నోటీసును ఆధారం చేసుకుని మునస్వామి కుటుంబం హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సదరు సర్వే నంబరులో రెవెన్యూ అధికారులు, ఇతర ప్రభుత్వ అధికారులు ఆ భూమిలోకి ప్రవేశించరాదని హైకోర్టు ఇంజక్షన్ ఆర్డర్ మంజూరు చేశారు. అప్పటినుండి అధికార పార్టీ వారు కొంత తగ్గినప్పటికీ సంవత్సరం తర్వాత మళ్లీ ఇప్పుడు ఎమ్మెల్యే వస్తున్నారని.. ఎమ్మెల్యే చెప్పారని.. స్థానిక ప్రజలకు ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇప్పిస్తామని వారి ని బుజ్జగించి జేసీబీను తీసుకొని వచ్చి మున స్వామి కుటుంబంపై దౌర్జన్యం చేయడానికి ప్రయత్నించినట్లు మునుస్వామి భార్య సత్యవేడు పోలీస్ స్టేషన్లో నాయకులపై ఫిర్యాదు చేసింది. పోలీసులు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరింది. ఈ సంఘటనపై పోలీసులు, రెవెన్యూ అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

పేదల దేవాలయాలు శ్మశానాలా..?

ఎమ్మెల్యే బియ్యపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేద అక్క, చెల్లెమ్మలకు అందజేసిన ఇంటి స్థలాలను శ్మశాన వాటికతో పోలుస్తూ చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు చేయడం విచారకరమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. పేదలు ఆ ఇళ్లను దేవాలయాలుగా భావిస్తున్నారనీ, ఒక బాధ్యత కల్గిన ప్రతి పక్ష నేతగా చంద్రబాబు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సహేతుకం కాదన్నారు. చంద్రబాబు వ్యాఖ్యలను ఖండిస్తూ ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వైసీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే బాబు తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. అంజూరు శ్రీనివాసులు, పసల సుమతి, మున్నా, జైశ్యామ్, గుమ్మడి బాలకష్ణయ్య, పగడాల రాజు, ఉన్నం వాసు నాయుడు, కోవి చంద్రయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వస్తే బీసీలకు పెద్దపీట




ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ అధికారంలోకి వస్తే వెనుకబడిన కులాల వారికి పెద్దపీట వేస్తామని ఆపార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వెనుకబడిన కులాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ హయాంలో బీసీ కులాలకు అగ్రస్థానం కల్పించారన్నారు. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో బీసీలకు 33శాతం రిజర్వేషను కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదే అన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీల రిజర్వేషన్ 22శాతానికే పరిమితం చేశారన్నారు. దీనిని బట్టి వైసీపీ అధినేత జగన్‌కు బీసీలపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోందన్నారు. తెలుగుదేశం హయాంలో బీసీ సబ్ ప్లాన్ అమలు చేసి ఆ కులాల అభివద్ధికి ఎంతో కషి చేశారన్నారు. అదేవిధంగా ఆదరణ పథకం కింద బీసీలకు పనిముట్లు అందించిన ఘనత కూడా టీడీపీదే అన్నారు. అయితే జగన్ ముఖ్యమంత్రి అయ్యాక బీసీ సబ్ ప్లాన్, ఆదరణ పథకం రద్దు చేసి బీసీలకు ద్రోహం చేశారన్నారు. బీసీలకు ద్రోహం చేసిన జగన్‌కు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీసీలు అంటే అందరూ బ్యాక్ వర్డ్ క్లాస్ అంటారనీ, అయితే టీడీపీ మాత్రం బ్యాక్‌బోన్ క్లాస్‌గా భావిస్తుందన్నారు. ఈ ఆత్మీయ సదస్సులో టీడీపీ బీసీ విభాగం నేతలు దశరధాచారి, రెడ్డివారి గురవారెడ్డి, సత్రవాడ ప్రవీణ్, సప్తగిరి ప్రసాద్, మునస్వామి యాదవ్, రేణుకాదేవి, మిన్నల రవి, మునిరాజా యాదవ్, కన్నావరం హరిబాబు, దొరైరాజ్ రెడ్డి, ఎంఎస్ రెడ్డి పాల్గొన్నారు.

తీవ్రవాద వ్యతిరేక దినం సందర్భంగా

రాక్షసక్రీడా చిత్రం

ప్రజాశక్తి-యాదమరి: జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినం సందర్భాన్ని పురస్కరించుకుని యాదమరి చిత్రకారుని చిత్ర స్పందన.
21-5-1991 మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని తీవ్రవాదులు పొట్టన పెట్టుకున్న రోజును నాటి ప్రధాని విపి.సింగ్ ప్రభుత్వం జాతీయ తీవ్రవాద వ్యతిరేక దినంగా ప్రకటించారు. నాటి నుండి జాతి యావత్తు జరుపు కోవడం ఆనవాయితీ. యాదమరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి తీవ్రవాదంపై చిత్రాల ద్వారా తన కుంచెతో తిరగబడ్డారు.
1.రాక్షసక్రీడ (ఆయిల్ కలర్స్): హింసవిశ్వరూపం దాని తాలూకు నరమేధం, బెల్టు బాంబుతో సష్టికి మూలమైన స్త్రీవినాశనానికి పూనుకున్న వైనం, పక్కనే పైశాచికత్వాన్ని పరాకాష్టగా శవాల గుట్ట వేదనా శిఖరాలని ఆవిష్కరిస్తుంది.



తిరుమలలో 5 మద్యం సీసాలు స్వాధీనం


హెచ్‌టి సముదాయంలో దుకాణం సీజ్

ప్రజాశక్తి - తిరుమల
తిరుమలలో మరోసారి మద్యం బాటిల్స్ కలకలం రేపాయి. కొందరు భక్తులు విజిలెన్స్ సిబ్బంది కళ్లుగప్పి మద్యం తిరుమలకు తీసుకువెళ్లారు. తాజాగా ఆదివారం హెచ్‌టి కాంప్లెక్స్‌లోని షాప్ నెం.78లో మద్యం లభ్యమైంది. విజిలెన్స్ తనిఖీల్లో 5 మద్యం సీసాలను అధికారులు స్వాధీనం చేసుకుని షాప్‌ను సీజ్ చేశారు. కాగా తిరుమలలో మద్యం విక్రయాలపై శ్రీవారి భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పవిత్రమైన కొండపై ఇలాంటి అక్రమాలకు అడ్డుకడ్డ వేయాలని కోరుతున్నారు. తిరుమల పవిత్రను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని.. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




సీజ్ చేసిన దుకాణం

ఈతకెళ్లి బాలుడి మృతి



మృతదేహానికి బావి నుంచి వెలికి తీస్తున్న గ్రామస్థులు

ప్రజాశక్తి- సోమల: ఈతకు వెళ్లితొమ్మిదేళ్ల బాలుడు బావిలో మునిగిని మరణించిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఇరికిపెంట పంచాయతీ ఎర్రనాగులవారిపల్లి గ్రామానికి చెందిన ప్రభు, మహాలక్ష్మి దంపతుల కుమారుడు మనోహర్ (9) గ్రామం సమీపంలోని గంగిరెడ్డిగారిపల్లి చెరువు వద్ద గల బావిలో ఆదివారం మధ్యాహ్నం ఈత కొట్టేందుకు గ్రామంలోని పిల్లలతో కలిసి వెళ్లాడు. అయితే ఈత రాకపోవడంతో మునిగిపోయాడు. విషయం గ్రామంలో తెలియడంతో గ్రామస్తులంతా బావి వద్దకు చేరి గాలింపు చర్యలు చేపట్టారు. బాలుడి ఆచూకీ తెలియకపోవడంతో పుంగనూరు అగ్నిమాపక కేంద్రం వారికి సమాచారం అందించారు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాలుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చీకటి పడటంతో బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేయడం కష్టతరమైంది. దీంతో గ్రామస్తుల సహకారంతో ఆరు విద్యుత్ మోటార్లను అమర్చి బావిలోని నీటిని బయటకు తోడి వేస్తున్నారు. బావిలో మొత్తం నీరు మోటార్లతో కొట్టిన తర్వాత బాలుడు కోసం గాలింపు చర్యలు చేపడతామని పుంగనూరు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. దాదాపు 5 గంటల సేపు గాలింపు చర్యలు చేపట్టి బావిలోని నీటిని మోటార్ల సాయంతో బయటకు తోడి రాత్రి 8.30 గంటలకు బాలుడు మతిచెందిన స్థితిలో గుర్తించి బావి నుండి వెలుపలకు తీశారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. బాలుడి తల్లిదండ్రులు చిన్నారి మతదేహాన్ని చూసి ఏడుస్తుండగా వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు.



వెలికితీసిన బాలుడి మృతదేహం



మృతుడు మనోహర్ (ఫైల్‌ఫొటో)

తిరుపతి టీచర్‌కు దుబాయ్‌లో అవార్డు



ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి సమీపంలోని చంద్రగిరి సానంబట్ల హైస్కూల్‌లో టీచర్‌గా పనిచేస్తున్న కమతం రెడ్డిప్రసాద్‌కు దుబాయ్‌లో విశిష్ట అవార్డు ప్రదానం చేశారు. ఈమేరకు కల్చరల్ సమ్మిట్ అండ్ ఇంటర్నేషనల్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్-2023 పేరుతో తెలుగు అసోసియేషన్ ఆఫ్ మలేషియా సంయుక్తంగా దుబాయ్‌లో శనివారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో రెడ్డిప్రసాద్‌కు 'తెలుగు జానపద సామ్రాట్' అవార్డును, సంస్థ మేమెంటోను బహూకరించి ఘనంగా సన్మానించారు. కాగా టీచర్ రెడ్డిప్రసాద్ తిరుపతి నలందానగర్‌లో నివాసం ఉంటున్నారు. రెడ్డిప్రసాద్‌కు అవార్డు రావడం పట్ల తిరుపతి, చిత్తూరు జిల్లాలోని ప్రముఖ టీచర్ సంఘాల నేతలు, రైల్వే యూనియన్ నాయకులు ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

కోలాహలంగా.. చంద్రగిరి ఐపీఎల్ టోర్నీ..!

గ్రామీణ యువత క్రీడా నైపుణ్యతకు చక్కటి అవకాశం
క్రికెట్ ఆడిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



ప్రజాశక్తి- క్యాంపస్: చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా యువతకు క్రికెట్ పోటీలు నిర్వహించేందుకు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన చంద్రగిరి ఐపిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో కోలాహలంగా యువత రెచ్చిపోయారు. ఆదివారం జరిగిన క్రికెట్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల్లో అత్యధిక శాతం మంది పరుగుల ప్రవాహం సష్టించగా మరికొంత మంది వికెట్ల పతనంలో తమ ప్రతిభను చాటుకున్నారు. బరిలో దిగిన ప్రతి ఒక్క క్రీడాకారుడు విజయం కోసం ప్రయత్నిస్తూ స్కోర్ పెంచుకునేందుకు శ్రమించారు. క్రికెట్ టోర్నమెంట్‌లో క్రీడాకారులు మధ్య ఏలాంటి విభేదాలు రాకుండా క్రికెట్‌పై పూర్తి స్థాయి శిక్షణ పొందిన 80మంది అంపైర్లతో పర్యవేక్షణ చేయిస్తున్నారు. టోర్నమెంట్‌లో అంపైర్లదే తుది నిర్ణయం కావడంతో ఆటలో ఎక్కడా క్రీడాకారులకు అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. గత వారం రోజులుగా జరుగుతున్న చంద్రగిరి ఐపీఎల్ వైఎస్ఆర్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌కు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు హాజరయ్యారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మోహిత్ రెడ్డిలు వారికి స్వాగతం పలికి క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్ మ్యాచ్ లను ఓపెన్ టాప్ వాహనం ద్వారా చూపించారు.

తుమ్మలగుంట వేదికగా గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్‌ను చూడగానే ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన చిన్నతనంలో క్రికెట్ ఆడిన రోజులు గుర్తు చేసుకున్నారు. టోర్నమెంట్ నిర్వహణ తీరు అద్భుతంగా ఉందని చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అభినందించారు. అనంతరం బ్యాట్ చేతబట్టుకున్న వేమిరెడ్డికి ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి బౌలింగ్ చేయడంతో బంతులను బౌండరీలు దాటించారు. ఆతర్వాత గ్రామీణ క్రికెట్ క్రీడాకారులతో కలిసి కొంత సమయం బ్యాటింగ్ చేశారు. అనంతరం పాకాల మండలం నుంచి దేశిరెడ్డిగారిపల్లి, పదిపుట్ల బైలు గ్రామాల మధ్యన జరుగుతున్న క్రికెట్ పోటీలను కొంత సమయం అక్కడే కూర్చుని ఆసక్తిగా తిలకించారు.

అనంతరం గ్రౌండ్ నంబర్ 9లో జరిగే మ్యాచ్‌ను తిలకిస్తూ అక్కడి క్రీడాకారులను ఆప్యాయంగా పలుకరించారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులు పూర్తిస్థాయిలో స్వేచ్ఛగా ఆటను ఆడుతున్నట్లు ఆయనకు వివరించారు. చంద్రగిరి ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ కు కేటాయించిన 13 గ్రౌండ్లలో యథావిధిగా 52 మ్యాచ్ లను నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్విరామంగా నాలుగు మ్యాచ్ లను నిర్వహించారు. ఒక్కో గ్రౌండ్ నుంచి నాలుగు మ్యాచ్‌ల చొప్పున 13గ్రౌండ్లలో 52మ్యాచ్ లను విజయవంతంగా ముగించారు. క్రికెట్ టోర్నమెంట్ పోటీల్లో గెలిచిన వారికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, బెస్ట్‌బౌలర్, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ ఆల్ రౌండర్ లకు బహుమతులు ప్రధానం చేశారు. అలాగే పోటీల్లో పాల్గొన్న ప్రతి ఒక్క క్రీడాకారున్ని ప్రోత్సాహించేలా పార్టిసిపేట్ మెడల్, ధవీకరణ పత్రంలను అందించారు.



వాస్కులర్ సర్జరీతో మెరుగైన ఆరోగ్యం

అపోలో సీనియర్ ఎండో వాస్కులర్ సర్జన్ డాక్టర్ బాలాజీ వెల్లడి



ప్రజాశక్తి- తిరుపతి టౌన్ : వాస్ కూలర్ సర్జరీతో రోగికి మెరుగైన వైద్యం చేయడమే కాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారని చెన్నై చెందిన అపోలో ఆసుపత్రి సీనియర్ వాస్కులర్, ఎండో వాస్కులర్ సర్జన్ డాక్టర్ బాలాజీ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని అపోలో క్లినిక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధమని సాధారణ వ్యాధులు వాస్కులర్ డీసీజ్ అని పిలవబడే బ్లాక్స్, రీసన్స్ అనే పిలవబడే ఉబ్బరం అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ అభివద్ధి వాస్కులర్ వ్యాధుల చికిత్సలో బాగా సహాయపడుతుందని అన్నారు. వాస్కులర్ వ్యాధులతో బాధపడుతున్న చాలామంది రోగులు ఇప్పుడు ఎండు వాస్కులర్ చికిత్స ఇన్ఫోసిస్ విధానాల ద్వారా చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఈవ్యాధి స్త్రీలలో ఎక్కువగా ఉంటున్నాయన్నారు. ఈ చికిత్స చేసుకున్నలు రెండురోజుల తర్వాత వారి పనిచేసుకోవడమే కాకుండా ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. చెన్నై అపోలో ఆసుపత్రిలో ఈచికిత్స రోగులకు చేస్తున్నట్టు వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: స్థానిక బైరాగిపట్టెడలోని మహాత్మా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో ఆదివారం ఉదయం 2008-2009 ఎస్ఎస్సీ బ్యాచ్ విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.మురుగన్, ఉపాధ్యాయులు లలితకుమారి, ఏం.మునిశారద, బండి మధుసూదన్ రెడ్డి, ఎం.గంగయ్య, ఎస్.ఖాదర్ ఉన్నిసా బేగం హాజరయ్యారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 15 వార్డు కార్పొరేటర్ తూకివాకం శాలిని మహేష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ 2008-09 బ్యాచ్ ఎస్ఎస్సి విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా గొప్ప విషయమని అన్నారు. పూర్వవిద్యార్థులు పాఠశాల అభివద్ధిలో పాలుపంచుకోవాలని తెలియజేశారు. పూర్వవిద్యార్థుల టీం లీడర్ గాది వినోద్, యాసిన్, సురేష్, భూపతి, దొరబాబు, గురుమూర్తి, ప్రేమ్ కుమార్, తూకీవాకం మహేష్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో డాక్టర్ సి.ఆర్ రెడ్డి ఆసరా కార్యక్రమంలో భాగంగా సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర సరుకులు అందించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సి.ఆర్ రెడ్డి పేరుతో వారి కుటుంబ సభ్యుల సహకారంతో ప్రతినెలా 3వ ఆదివారం పేదవారికి నిత్యావసర సరుకులు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పి.వి. కష్ణారెడ్డి , ప్రజేంద్రరెడ్డి , కిశోర్ రెడ్డి, కృష్ణారెడ్డి, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వేణుబాకలో 'మన ఇల్లు.. మన జనసేన'



ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని వేణుంబాక పంచాయతీలో 'మన ఇల్లు-మన జనసేన' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ జనసేన యువనేత రోసనూరు సోమశేఖర్ వేణుంబాక పంచాయతీలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మణి ఆధ్వర్యంలో మన ఇల్లు - మన జనసేన కార్యక్రమం చేపట్టారు. ప్రతి కుటుంబాన్ని కలుస్తూ స్థానిక సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. నేషనల్ హైవే నుంచి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిని, అంతర్గత సిసి రోడ్లను నిర్మించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు తమ సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేసి 2024 లో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ తడ మండల ప్రధాన కార్యదర్శి పులి దిలీప్ కుమార్, జనసైనికులు మల్లి, రమేష్, సునీల్, వంశీ, హరి, శేఖర్, సురేష్, వీరాస్వామి, అశోక్, శివ, సునీల్, కార్తీక్, కస్తూరయ్య, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

పాలిసెట్ ఫలితాల్లో ప్రతిభ




ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు శనివారం విడుదలైన పాలిసెట్ ఫలితాల్లో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం గూడూరు పట్టణం లోని శివాని స్టడీ సర్కిల్‌లో విద్యార్థులకు అభినందించారు. విగ్నేష్ 120 మార్కులకు గాను 111, మేఘన 101 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులను సాధించడం సంతోషంగా ఉందన్నారు. 45 మంది విద్యార్థులు మంచి ర్యాంకులను సాధించారని తెలిపారు. అనంతరం విద్యార్థులు భవిష్యత్ లో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈ మునిరాజా, స్టడీ సర్కిల్ నిర్వాహకులు శివకుమార్‌రెడ్డి, ఫిజిక్స్ ఉపాధ్యాయులు రాధయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు మేరిగ మురళీధర్ జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని షాదీమంజిల్‌లో ఆదివారం వైసీపీ మైనారిటీ నాయకులు విలేకరులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ యువ నాయకులు, ఈద్గా యూత్ అధ్యక్షులు షేక్ షబ్బీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.జలీల్ మాట్లాడుతూ 23న మంగళవారం గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు, సీనియర్ నాయకులు మేరిగ మురళీధర్ జన్మదిన వేడుకలను వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి సీనియర్ నాయకులు మొహమ్మద్ మగ్దూమ్ భాయ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ముందుగా హజరత్ హాషిం హుస్సేనీ బాబా దర్గా లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించానున్నామన్నారు. అనంతరం షాదీ మంజిల్‌లో 150 మంది మహిళలకు దుస్తులు పంపిణీ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. జగనన్న కుటుంబ సభ్యులు, మురళీధర్ అభిమానులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో వైసీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ మగ్దూమ్, జలీల్, బాబు, షబ్బీర్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

వేషాలమ్మ సేవలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి




ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని శ్రీ వేషాలమ్మ అమ్మవారిని తెలంగాణ రాష్ట్రం కొడంగల్ నియోజకవర్గం శాసనసభ్యులు పట్నం నరేందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తిరుపతి పర్యటనలో భాగంగా ఆయన ఆలయానికి రావడంతో ఆలయ పాలకమండలి సభ్యులు, అర్చకులు దర్శన ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక క్షేత్రంలో గంగ జాతరను ఘనంగా నిర్వహించారని, వేషాలమ్మ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు.

నాయుడుపేటలో మజ్జిగ పంపిణీ



ప్రజాశక్తి-నాయుడుపేట: గతనెల రోజులుగా సత్యసాయి ఆధ్వర్యంలో రోజూ నాయుడుపేటలో రోజూ మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. విపరీతంగా మండిపోతున్న ఎండలకు చల్లని మజ్జిగ పంపిణీ చేస్తూ అందరి మన్ననలను పొందుతున్నారు. చుట్టుపక్కల పల్లెల నుంచి నాయుడుపేటకు వస్తున్న వారి దాహార్తిని తీరుస్తున్నారు. ఫౌండేషన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ మండిపోతున్న ఎండలకు నలుగురి దాహాన్ని తీర్చే అవకాశం రావడం ఆనందంగా ఉందని తెలిపారు.

వామ్మో కరెంట్ కష్టాలు..!



- బ్రేక్‌డౌన్లతో రైతులకు బేజారు
- తరచూ దెబ్బతింటున్న 33 కేవీ లైన్లు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-తొట్టంబేడు: విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం.. ఉదాసీనత వెరసి పల్లెల్లో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతోంది. కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. ముఖ్యంగా వర్షాకాలం వస్తే పల్లెల్లో అంధకారమే. వేసవికాలంలోనైనా ఈ పద్ధతి మారుతుందేమో అనుకుంటే వేసవిలోనూ అదే తంతు నడుస్తోంది. తొట్టంబేడు మండల పరిధిలోని బోనుపల్లి, పల్లమాల, చియ్యవరం, సబ్ స్టేషన్‌ల పరిధిలో ఉండే గ్రామాలకు కరెంట్ కష్టాలు వర్ణనాతీతం. తరచూ 33 కేవీ లైన్లు దెబ్బతినడంతో కొన్ని గ్రామాలలో గంటల తరబడి మరికొన్ని గ్రామాలలో రోజుల తరబడి విద్యుత్‌కి అంతరాయం ఏర్పడుతోంది. అయితే సకాలంలో మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా సబ్ స్టేషన్ల పరిధిలో పనిచేసే కొందరు లైన్‌మెన్‌లు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని.. ఏ అవసరం వచ్చినా జేఎల్ఎంను సంప్రదించాల్సి వస్తుందంటూ ప్రజలు వాపోతున్నారు. ఫలితంగా సమస్యలు గుర్తించినా సకాలంలో విద్యుత్ శాఖ సిబ్బంది రాకపోవడంతో మరమ్మతులు జరగక గ్రామాలకు విద్యుత్ సరఫరా ఆగిపోతుందని ప్రజలు మండిపడుతున్నారు. సాధారణంగా 33 కెవి లైన్లో సమస్యలు తలెత్తినప్పుడు రెండు గంటల్లోపే మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. అయితే కొన్ని సందర్భాల్లో రోజులు గడిచినా మరమ్మతులు పూర్తి కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాకాలం వస్తే చినుకు పడిన గాలులు వీచినా, ఉరుములు.. మెరుపులు మెరిసినా ఉన్నఫలంగా కరెంటు పోతుండటంతో గ్రామాల వాసులు గుడ్డి దీపాల మధ్య కాలం వెళ్లదీయాల్సి వస్తోంది.

బ్రేక్ డౌన్లతో అవస్థలు

మండలంలోని చియ్యావరం సబ్ స్టేషన్ పరిధిలోని చోడవరం, చేమూరు, రెడ్డి గుంట, పెద్దగుంట, కొత్త కండ్రిగ గ్రామాలలో రైతులు బ్రేక్‌డౌన్‌లతో బేజారవుతుందని వాపోతున్నారు. జగనన్న ప్రభుత్వం రైతులకు 9 గంటల కరెంటు కచ్చితంగా అందిస్తున్నామని ఊదరగొడుతుంది. అయితే దానికి భిన్నంగా తొట్టంబేడు మండలంలోని రైతులకు కరెంటు అందుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఉదయం 4.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర గంట వరకు కరెంటు ఇవ్వాలి. అలాగే రెండో వారం 9.30 గంటల నుంచి ఆరున్నర గంటలకు రైతుల మోటార్లకు మూడు లైన్ల కరెంటు అందించాలి. కరెంటు సకాలంలో వస్తుందని రైతులు తెల్లవారు జామున 4 గంటలకే వెళ్లి పొలం దగ్గర కూర్చొని ఉంటారు. అయితే ఆ కరెంటు ఎప్పుడు వస్తుందో.. ఎప్పుడు ఆగిపోతుందో తెలియక అవస్థలు పడుతున్నారు. శనివారం ఉదయం నాలుగున్నర గంటల నుంచి 12 గంటల వరకు రైతులు పొలంలో వేచి చూస్తుంటే కరెంటు తొమ్మిది గంటల సరఫరాకు గాను కేవలం 6 గంటలు మాత్రమే రావడం విచారకరం. రైతు మధ్యాహ్నం ఇంటికి వెళ్లి భోజనం చేసే సమయంలో మళ్లీ కరెంటు వచ్చిందని మూడు గంటలకు పరిగెత్తుకుని పొలం దగ్గరికి వెళితే రివర్స్ కరెంటు వదులుతున్నారట. అది ఎలా వేయాలో తెలియక కొంతమంది బేజారు చెందుతున్నారు. మరి కొంతమంది రైతులు ఆ కరెంటునూ ఉపయోగించుకుంటున్నారు. ఇది తొట్టంబేడు రైతులపై విద్యుత్ శాఖ అధికారులు చూపుతున్న చవితి ప్రేమ.

అంధకారంలో పలు గ్రామాలు

మండలంలోని కొన్నలి, పెన్నలపాడు, పూడి గ్రామాలలో నెలలు తరబడి కరెంట్ తో కష్టాలు ఎదుర్కొంటున్న విద్యుత్ అధికారులు నిమ్మకునీరొత్తినట్లు వ్యవహరిస్తున్నారు. రోజుకు కనీసం ఏడు గంటలు సైతంత కరెంటు ఇవ్వడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో ఎండకు తట్టుకోలేక చిన్నపిల్లలు, వద్ధులు, విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారులను సమస్య పరిష్కరించకుండా సాకులు చెప్పుకుంటూ తప్పించుకుంటున్నారు. రాత్రులలో కరెంటు లేక అవస్థలు పడుతున్నా.. విద్యుత్‌శాఖ అధికారులకు ఫోన్ చేసినా తీయడం లేదు. మళ్లీ ఫోన్‌చేస్తే స్విచ్ ఆఫ్ చేస్తున్నారని వాపోతున్నారు. దీంతో విద్యార్థులు చదువులకు దూరం అవుతున్నారు. దోమలతో అల్లాడిపోతున్నారు.

కోటలోనూ తప్పని విద్యుత్తు కోతలు

ప్రజాశక్తి-కోట: కోట మండలంలో 'లో వోల్టేజీ.. విద్యుత్ సరఫరాలో కోతలతో ఉక్కపోతతో ప్రజలు, వ్యవసాయానికి నీరందక రైతులు అవస్థలు పడుతున్నారు. గత నెలరోజులుగా లో వోల్టేజ్‌తో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అవస్థలు తప్పడం లేదు. మండలంలోని విద్యానగర్- కొత్తపాలెం రోడ్డు సమీపంలో ఒకే ఒక వీధిలో నివసిస్తున్న పలు కుటుంబాలకు విద్యుత్ సరఫరా అందించే ట్రాన్స్‌ఫార్మర్‌లో లో వోల్టేజ్ సమస్య ఉందని విద్యుత్ శాఖ అధికారులు పదేపదే చెప్తున్నా.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేయడంలో విఫలం అవుతున్నారు. ఆదివారం కావడంతో ప్రతి ఒక్కరూ ఇంటికే పరిమితం అవడంతో గహంలో నిత్యావసరాలు సమకూర్చుకోవడానికి విద్యుత్ లేకపోవడంతో అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు స్పందించి శాశ్వతంగా విద్యుత్ సమస్య లేకుండా మరొక ట్రాన్స్‌ఫార్మర్ అమర్చాలని ఆ సమీపంలో ఉండే పలు కుటుంబాలు కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ డీఈ ఇస్మాయిల్ ను వివరణ కోరగా త్వరలోనే 'లో వోల్టేజ్ సమస్య' లేకుండా శాశ్వత పరిష్కారం తీసుకుంటామని తెలిపారు.

రైతులకు 9 గంటల కరెంటు ఇవ్వాలి

ఖరీఫ్ సీజన్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. ప్రతి గ్రామంలో నారు పోస్తున్నారు. పొలాలు సాగు చేసేందుకు ప్రతి రైతుకు నీరు అవసరం. కరెంటు ఇవ్వకపోతే రైతులు నష్టపోతారు. విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి రైతుకు 9 గంటల కరెంటు వచ్చేలా చూడాల్సిన అవసరం ఉంది.

\- గురవయ్య, సీఐటీయూ నాయకులు



అపూర్వం.. పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని నెలబల్లి హైస్కూల్‌లో ఆదివారం 2004-2005 సంవత్సరం పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమం ఘనంగా జరిగింది. అప్పటి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయనకు శాలువాకప్పి పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. తమ పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ చదువు చెప్పిన గురువులను కలిసి సన్మానించుకోవడం అదష్టమని, వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన అందరూ కలవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు.

వాలీబాల్ కిట్ల పంపిణీ



ప్రజాశక్తి-తొట్టంబేడు: జాతీయ వినియోగదారుల హక్కుల కమిషను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం తొట్టంబేడు మండలం తాటిపర్తి పంచాయతీ కల్లిపూడి ఎస్సీ కాలనీకి చెందిన యువతకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలవగుంట భరత్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువతను క్రీడల్లో ప్రోత్సహించి వారిలోని ప్రతిభను వెలికి తీయాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగానే తాను గ్రామీణ ప్రాంత యువతకు క్రీడా సామాగ్రి అందజేస్తున్నట్లు చెప్పారు. యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలవగుంట భరత్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మునిరాజా రెడ్డి, వెంకటయ్య, కల్లిపూడి యువత, పాత్రికేయులు జి.మునిచంద్రతో పాటు భరత్ యువత సభ్యులు బాలాజీరెడ్డి, బాబుల్ రెడ్డి, వినయ్, హేమంత్, నితేష్, రవి, స్వామి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు ఆర్థిక సాయం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని రణధీరపురం గ్రామపంచాయతీ 6వ వార్డులో నివాసముంటున్న దుర్గభవాని తల్లిదండ్రులు ఇటీవల అనారోగ్య కారణాలతో మరణించారు. తల్లిదండ్రులను కోల్పోయిన ఆ అమ్మాయికి ఆర్థిక భరోసా కల్పించాలని ఉద్దేశంతో స్థానిక వార్డు సభ్యురాలు పద్మావతి ఆధ్వర్యంలో వైసీపీ నాయకులు తుంటి సుధాయాదవ్ రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. తల్లిదండ్రులు కోల్పోవడంతో మనోధైర్యాన్ని కోల్పోవద్దని.. తామంతా ఉన్నామని దుర్గాభవానికి ధైర్యం చెప్పామని సుధా యాదవ్ చెప్పారు.


ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి





ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్వర్గీయ రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పంట శ్రీనివాసులురెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాల్లోకెల్లా భారత దేశాన్ని సాంకేతిక రంగంలో ఎంతో అభివద్ధి చేసిన వ్యక్తి రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ప్రతిఒక్కరూ ఆయన ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు ప్రతిఒక్కరూ కషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్వేపల్లి ఇన్‌ఛార్జి పూల చంద్రశేఖర్, వేమయ్య, నాగభూషణం, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: దేశ ప్రజల కోసం రాజీవ్ గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు చారిత్రాత్మకమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వి ఆర్ రావణన్ అన్నారు. ఆదివారం దేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి వేడుకలను ఆయన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీఆర్ రావనన్ మాట్లాడుతూ దేశం కోసం రాజీవ్ గాంధీ కుటుంబం చేసిన సేవలను స్మరించుకున్నారు. దేశ ప్రజల కోసం రాజీవ్ గాంధీ కుటుంబం చేసిన త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ ఎస్టీ సెల్ నాయకులు మణి, గోపి, ఆటో యూనియన్ నాయకులు శంకర్, జానీ, అరుణ్ మాలిక్ తదితరులు పాల్గొన్నారు.




తిరుపతి(మంగళం): భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 32వ వర్ధంతిని పురస్కరించుకొని నగర పరిధిలోని ఆయన విగ్రహానికి ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశం శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొవడానికి ఆ రోజుల్లో ముందుచూపుతో రాజీవ్ గాంధీ తీసుకున్న చర్యలే కారణమన్నారు. సీనియర్ నాయకులు తమటం వెంకట నరసింహులు మాట్లాడుతూ దేశం కోసం తమ ప్రాణాలను, సర్వస్వాన్ని దారబోసింది ఒక్క రాజీవ్ గాంధీ కుటుంబ మేనన్నారు. పిసిసి ఎస్సి విభాగం కో చైర్మన్ గౌడపేరు చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో పేదరిక నిర్మూలన కోసం, దేశభ్యున్నతి కోసం పరితపించినది, కషి చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయే నన్నారు. 2024లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దూది రమేష్, ఎస్సీ విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు చిత్తూరు శివశంకర్, రాష్ట్ర కన్వీనర్ బోయన నరేంద్ర బాబు, అఖిలభారత అసంఘటిత రంగ కార్మిక సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు పోతల భాస్కర్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లీల శ్రీనివాస్, కార్యదర్శి సుప్రజ, మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నే ఖాన్, కాంగ్రెస్ పార్టీ ఓబిసి విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు గోపి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల వెతలు పట్టని ప్రభుత్వం

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చినబాబు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పోలీసుల బాధలను జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని చిత్తూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చినబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టేషనరీ కొనుగోలుకు ఒక్కో పోలీస్ స్టేషన్‌కు రూ.15 వేలు నుంచి రూ.40 వేల వరకు మూడు నెలలకు ఓసారి నిధులు కేటాయించడం సాధారణమని చెప్పారు. అయితే జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్టేషనరీకి ఒక్క రూపాయి విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో ప్రతి పోలీస్ స్టేషన్‌కు ప్రింటర్, స్కానర్, కంప్యూటర్లు, జెరాక్స్ మిషన్లు మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. నాలుగేళ్లుగా స్టేషనరీకి బడ్జెట్ కేటాయించకపోవడంతో అవన్నీ మూలనపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రావెల్ అలవెన్సులకు దిక్కు లేకుండా పోయిందని, ఈ చేతగాని ప్రభుత్వం కారణంగా పోలీసు సిబ్బంది



అప్పులపాలవుతున్నారని ఆయన ధ్వజమెత్తారు. చంద్రబాబునాయుడు హయాంలో ఒక్కో పోలీస్ స్టేషన్‌కు ఒక కోటి ఇరవై లక్షల రూపాయలు వెచ్చించి రాష్ట్ర వ్యాప్తంగా 110 అత్యాధునిక పోలీస్ స్టేషన్లను నిర్మిస్తే, ఈ ప్రభుత్వం నాలుగేళ్లలో ఒక్కటైనా నిర్మించిందా అని నిలదీశారు. దిశ వాహనాలు తప్ప నూతనంగా ఒక్క కొత్త పోలీసు వాహనం కూడా కొనుగోలు చేయని అసమర్థ ప్రభుత్వమని మండిపడ్డారు. కనీసం పాత వాహనాలకు మరమ్మతులకు అవసరమైన నిధులు కేటాయించకపోవడం దురదృష్టమన్నారు. రక్షక్, హైవే, పెట్రోలింగ్ వాహనాలకు కేటాయించే డీజల్ కోటాలను కోత విధించడాన్ని ఆయన తప్పు పట్టారు. గతంలో నెలకు 200 లీటర్లు డీజల్ ఇస్తుండగా.. ఇప్పుడు 120 లీటర్లకు తగ్గించారని, అలాగే పట్టణాల్లో పెట్రోలింగ్ చేసే ద్విచక్ర వాహనాలకు నెలకు 45 లీటర్లు కోటా ఉండగా దాన్ని 30 లీటర్లకు మండల స్థాయి స్టేషన్లలో నెలకు 20 లీటర్లకు తగ్గించడంతో పగలు, రాత్రి పూర్తి స్థాయిలో పెట్రోలింగ్ చేయలేకపోవడం నేరాలు పెరిగిపోతున్నాయి తెలిపారు. పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడమేనని తేల్చి చెప్పారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మనసు మార్చుకుని పోలీసింగ్ పటిష్టతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన హితబోధ చేశారు.

సర్పంచ్ భర్తపై దాడికి యత్నం

ప్రజాశక్తి-ఓజిలి: మాచవరం సర్పంచ్ పిండుకూరు.మౌనిక రెడ్డి భర్త వైసీపీ నాయకులు పిండుకూరు మధుసూదన్‌రెడ్డిపై అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు దాడికి పాల్పడినట్టు ఓజిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పి.మధుసూదన్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తన అనుమతులు లేకుండా ఇంట్లో ఉన్న బైకును వెడిచర్ల వాసు తీసుకెళ్లడంతో దాన్ని ఎందుకు తీసుకెళ్లావని ప్రశ్నించినందుకు గాను తనపై వాసు, శివ, పొండయ్య, వెంకటేష్ స్నేహితులతో కలిసి మద్యం సేవించి ఇంట్లో నిద్రిస్తున్న తనపై దాడికి ప్రయత్నించారన్నారు. అడ్డొచ్చిన తన భార్యను దుర్భాషలాడారని.. తనపై దాడికి ప్రయత్నించిన వారితో తమ కుటుంబానికి ప్రాణహాని ఉందని.. వారి నుండి తమను కాపాడాలని ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



ప్రజాశక్తి-గూడూరు రూరల్ : ప్రతిఒక్కరూ విద్యతోనే సమాజంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని.. ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బలిజ అభ్యుదయ సేవా సంఘం సభ్యులు శీలం కిరణ్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని మినీ బైపాస్ లో ఉన్న ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్లో బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బలిజ విద్యార్థిని , విద్యార్థులకు సంఘ సభ్యులు నగదు ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి ఎదుగుదలకు విద్య ఎంతో ముఖ్యమన్నారు. విద్యతో ఎంతోమంది ఉన్నత స్థాయికి ఎదిగారని తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహిస్తూ బలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ప్రోత్సాహకలు అందించడం అభినందనీయమన్నారు. సంఘం అభివృద్ధికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎలక్ట్రికల్ డీఈ అనిల్‌కుమార్, మదన మేటి రమణయ్య, చదలవాడ హరిబాబు, మల్లిఖార్జున, సారంగం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి జిల్లా కేంద్రంలో కేంద్రం, రాష్ట్ర పర్యాటక శాఖలచే సంయుక్తంగా నిర్వహిస్తున్న స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ, అప్లైడ్ న్యూట్రీషియన్ కళాశాలలో 2023-24 సంవత్సరం హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ జూలై 30వ తేదీ వరకు ఉంటుందని ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టరు ఆర్.రమణ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కోర్సుల వివరాలు: 1. బిఎస్‌సి మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్ నందు 50 శాతం మార్కులు కలిగిన వారు, 2. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ 1వ సంవత్సరం, ఎస్ఎస్‌సి పాసైన వారు, 3.సర్టిఫికేట్ కోర్స్ ఇన్‌ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీసెస్ ఆరు నెలలు ఎస్ఎస్‌సి పాసైన వారు అర్హులని పేర్కొన్నారు. కోర్సు పూర్తైన తరువాత ప్రముఖ ఫైవ్‌స్టార్ హోటల్స్‌లో ఉద్యోగ అవకాశాలు, బ్యాంక్ లోన్ సదుపాయం, రవాణా సౌకర్యం, బాల బాలికలకు వేరువేరు హాస్టల్స్ సదుపాయం కలదని యువత సద్వినియోగం చేసుకోవాలని, వివరాలకు 97004 40604, 91005 58006, 97013 43846 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆదర్శ పాఠశాలలో ఇంటర్‌కు దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుపతి జిల్లాలోని ఐదు మోడల్ స్కూల్స్ (ఆదర్శ పాఠశాలల)లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరానికి దరఖాస్తులను ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిసి, బైపిసి, ఎంఎఫ్‌సి, సిఈసి గ్రూపుల్లో ఉచితవిద్య పొందే విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని అన్నారు. ఈపాఠశాలలో విద్యనభ్యసించే వారు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ప్రభుత్వం, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన వారు అర్హులు, ఈ నెల 22వ తేది నుంచి జూన్ 7వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, వివరాలకు ఏపిఎంఎస్.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

కోటలో శివాజీరావు వర్ధంతి వేడుకలు



ప్రజాశక్తి -కోట: కోటకు చెందిన ప్రజావైద్యుడు డాక్టర్ ధనిశెట్టి శివాజీరావు పన్నెండవ వర్ధంతిని ఆయన స్వగహంలో శివాజీరావు స్నేహితులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, అభిమానులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. శివాజీ రావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ నిబద్ధత కలిగిన మార్క్సిస్టుగా, ప్రజా వైద్యుడిగా, సామాజిక కార్యకర్తగా శివాజీ రావు పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయం అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటాచలం, ఆర్ఎంపీ వైద్యులు సారంగం రమేష్ బాబు, ఆర్‌వీ రమణయ్య, భాష, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్, పీవీ కష్ణయ్య, మీజూరు చెంగయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ప్రజాశక్తి-రేణిగుంట: క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని రిటైర్డ్ పిడి సుధాకర్, పిసిసి ఛైర్మన్ దివాకర్ స్పష్టం చేశారు. ఆదివారం గాజులమండ్యం పంచాయతీ పరిధిలోని జీవాగ్రామ్ మైదానంలో యువకులకు, పిల్లలకు ఫుట్‌బాల్ శిక్షణ కార్యక్రమాన్ని జీవో గ్రామ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ పి.డి. ఎస్.సుధాకర్, పి.సి.సి.ఛైర్మన్ కె.పి.దివాకర్‌లు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్. సుధాకర్, కె.పి. దివాకర్ లు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని యువతీ యువకులు, పిల్లలు ఎవరైనా పాల్గొని ఫుట్బాల్ శిక్షణ పొందచ్చని తెలిపారు. క్యాంప్ నిర్వాహకులు కె. యేసురత్నం, పి. పాల్ భరత్ భూషణ్, ఏ. జగదీష్, నవీన్, స్వామిదాసు, సన్నీ యువకులు తదితరులు పాల్గొన్నారు.